# జైలు కథలు-13

సమయం మధ్యాహ్నం సుమారు పన్నెండు గంటల ముప్పయి నిమిషాలయింది. బ్లాక్ చాలవరకు నిద్రావస్థలో వుంది. "సలలిత రాగ సుధారస సారం...." డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారి పాట సుధారస ధారగా ప్రవహిస్తోంది రేడియోలో నుంచి మంగళంపల్లి వారి మీద నాకు ఎనలేని అభిమానం. వారి సంగీత పాండిత్యం అలాటిది.

బయట పెద్దపెద్ద అరుపులు విని వడివడిగా నడిచాను. వార్డర్ తుకారాం ఎవరో ఖైదీతో ఘర్షణ పడుతున్నాడు.

"నడువ్ జైలర్ సాబ్ వద్దకు" తుకారాం మాటలు విని తృళ్ళిపడ్డాను. జైలర్ వద్దకు వెళ్తే జరిగేది అతనికి తెలియదేమోగాని నాకు బాగా తెలుసు. వెళ్ళినవాడు అలాగే బయటకు రాడు. వళ్ళంతా వాచి పోయి మాత్రమే వస్తాడు.

"తుకారాంగారూ అతనికి నేను చెప్తాను. వదిలేయండి" నావంక అదోలా చూసి అతన్ని వదలి వెళ్ళాడు తుకారాం. నన్నభిమానించే కొద్దిమంది జైలు సిబ్బందిలో తుకారాం ఒకడు. తీక్షణంగా చూశాను ఖైదీ వేపు. తల పంచాడతను. చామనచాయ. నంకీల జుత్తు. మంచి ముఖవర్చస్సు. మనిషి బలంగా వున్నాడు.




"ఏమైంది" సౌమ్యంగా అడిగాను.

"అన్నం చాలదన్నాను...అంతే" వంచిన తల ఎత్తకుండానే సమాధాన మిచ్చాడు.

"ఏ వూరు ?" చెప్పాడు.

"నీ అపరాధం ?"

"నిరపరాధినిబాబూ....ఆ....పటేల్ ...."

క్రోధంతో పళ్ళు కొరికాడు. గొంతు పెగల్లేదు. అయినా జరిగింది తెలుసుకోవాలనే అభిలాష.

"విషయం చెప్పు" అన్నాను.

* * *

కోడంగల్ తాలూకాలోని చిన్న గ్రామం దశరథ్‌ది. ఆ వూరి మోతుబరి రైతు జగన్నాథరెడ్డి. కోపిష్టి. గర్వి. కామాంధుడు. స్త్రీలపాలిట కిరాతకుడు. అయినా అతనికి వున్న ఆస్తి పలుకుబడి అందరినోళ్ళు మూయించేది. ఎవరైనా సహించలేక ముందుకువస్తే వారికి ఆనాటితో నూకలు చెల్లినట్లే. విద్యాగంధం వున్నవారు తక్కువ. అందువల్ల అందరినీ తన చెప్పుచేతల్లో వుంచుకొనేవాడు.

ఆ వూరికి క్రొత్తగావచ్చిన ఎలిమెంటరీ స్కూల్ టీచర్ విమల. సుగుణవతి. రూపవతి. అణకువ, ఆప్యాయత ఆమెకు పెట్టని ఆభరణాలు. అందరినీ ఆకర్షించుకోగల మంచితనం రూపానికి మెరుగులు దిద్దింది. ఆమె వచ్చిన క్రొత్తలో బస రెడ్డిగారి యింట్లోనే ఏర్పాటు చేయబడింది. కాని వారం తిరక్కుండానే దశరథ్ యింటికి మకాం మార్చింది. కారణం అందరకూ తెలిసిందే. రెడ్డికి దూరంగా అయితే రాగలిగిందిగాని, అతను ప్రయత్నాలు మాత్రం మానలేదు. పైగా పట్టుదల అధికమైంది.

దశరథ్ బి. ఎ. వరకూ చదువుకున్నాడు. చదువుకున్నవారికి అర్హతలను బట్టి తగిన ఉద్యోగావకాశాలు కల్పించలేని ప్రభుత్వాన్ని నిందించలేక వ్యవసాయం చేసికోసాగాడు. ఒకరోజు రాత్రి పది గంటల సమయంలో రెడ్డి వద్దనుండి విమలకు కబురందింది. వెళ్ళక తప్పదు. దశరథ్‌తో చెప్పి బయలుదేరింది. ఆమె వెళ్ళిన కాసేపటికి స్కూలువేపు వెళ్ళాడు దశరథ్. లోపలనుంచి వినిపిస్తున్న మాటలు విని కాళ్ళు తడబడ్డాయి.

"బాబూ నేను మీ కూతురు లాటిదాన్ని నన్ను యిలా అల్లరి పెట్టడం మీకు భావ్యం కాదు" విమల గొంతు దీనాతిదీనంగా వుంది.

"విమలా ! నన్నెదిరించేవారులేరు. నా మాట వింటే నిన్ను మహారాణిని చేయగలను. రా.... నామాట విను. కాదనకు.." రెడ్డి కంఠం కామంతో కంపిస్తోంది. యువకరక్తం పరువులెత్తింది దశరథ్‌లో. ఇక ఆలస్యం చేయలేదు. తలుపును వొక్కతన్ను తన్నాడు. లోపలి దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు. అతని బాహుబంధాల్లోనించి విముక్తికోసం పెనుగులాడుతోంది విమల. "రెడ్డీ"-భూనభోంతరాళాలు దద్దరిల్లే గర్జన విని తలెత్తాడు రెడ్డి. త్రాచుపాములా బుసపెడుతున్న దశరథ్‌వంక వురిమిచూసి వేగంగా నిష్క్రమించాడు రెడ్డి. వొక్కసారిగా దశరథ్ వక్షస్థలంపై వాలిపోయింది విమల. అనునయించాడు దశరథ్. అయినా భయంతో విమల శరీరం కంపిస్తూనే వుంది.

ఇది జరిగిన వారం రోజులకు నిదురలో వున్న దశరథ్‌ను ఎవరో తట్టిలేపారు. తృళ్ళిపడి లేచాడు దశరథ్. చీకట్లో వ్యక్తిని గుర్తించలేకపోయాడు. "పంతులమ్మ బళ్ళో వుంది" చెప్పి వెళ్ళిపోయాడతను. ఆమె ఎలా వెళ్ళిందో ? ఎందుకు వెళ్ళిందో అర్థం కాని దశరథ్ పరుగు పరుగున స్కూల్‌కు వెళ్ళాడు. తలుపుతీసిన దశరథ్ స్థాణువైపోయాడు. విమల గుండెల్లో పిడిబాకు దిగబడి వుంది. చేయిపట్టి చూశాడు. చల్లగా వుంది. అంటే విమల విగతజీవి. వొక్కసారిగా భూమి కంపించినట్లైంది. సప్త సముద్రఘోష వినిపించింది. "విమలా !" మెల్లగా గొణిగాడు కాని జవాబు చెప్పలేని లోకాలకు తరలి పోయిందామె. అదే సమయంలో గ్రామస్థులతో లోన ప్రవేశించాడు రెడ్డి. అప్పు డర్థమైంది. అసలు విషయం దశరథ్‌కు. అతనిపై హత్యాపరాధం మోపబడింది.

కథ ముగించిన దశరథ్‌వేపు చూశాను. కళ్ళలో యిమడలేని నీళ్ళు....కాదు....కాదు....గుండెపొరల్లోని మమకారపు తడి చెంపలమీదుగా జారి, భూమిపై పడి యింకిపోతోంది.

—ప్రసాద్